క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (సోమవారం) కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నియామకం


నాగరాజు


రాజ్‌కుమార్

టేకుమట్ల/కాళేశ్వరం/మల్హర్: శ్రీమిత్ర ఫౌండేషన్ టేకుమట్ల, మహదేవపూర్, మల్హర్ మండల కన్వీనర్‌గా తిప్పరవేని నాగరాజు, శ్రీకాంత్, రాజకుమార్‌ను నియమించినట్లు శ్రీమిత్ర ఫౌండేషన్ చైర్మన్ అట్టెం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీమిత్ర ఫౌండేషన్ కల్పించిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని తెలిపారు. తమకు మండల కన్వీనర్‌గా అవకాశం కల్పించిన రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గడువు పొడిగింపు

ములుగు: డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు(డీఎంఎల్‌టీ), డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డీఎంఎఫ్‌టీ) కోర్సుల్లో అడ్మిషన్ పొందడానికి గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 30 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అన్ని రకాల విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాటు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని జోడించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా 7013952246 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుడిని ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు



ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఉన్న బీరన్న గుడిని కారు ఢీకొట్టిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు పంచాయతీ పరిధి పాల్‌సాబ్‌పల్లికి చెందిన తైరెడ్డి సుధాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దీపావళి పండగకు ఇంటి వచ్చి శనివారం రాత్రి తనకు చెందిన టీఎస్ 07 జీఆర్ 1566 కారులో మండలంలోని కన్నాయిగూడెం గ్రామానికి చెందిన రావుల రాజేశ్వర్‌రావు, నాగభూషణంతో పాటు వరంగల్‌కు చెందిన సత్యనారాయణలతో కలిసి హనుమకొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో మల్లంపల్లి వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి జాతీయ రహదారిపై ఉన్న బీరన్న గుడిని ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

కారు బోల్తా ..

భూపాలపల్లి రూరల్: అదుపు తప్పి కారు బోల్తాపడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ క్రాస్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన కడదాసు సుభాష్ సునీత దంపతులు కాళేశ్వరం దర్శనానికి వెళ్లి తిరిగి బంధువుల ఇంటికి భూపాలపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కోతులు అడ్డు రావడంతో వాటిని తప్పించబోగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. సుభాష్‌తో పాటు అతని భార్య సునీత వారి కుమారుడు సాయి చరణ్, చెల్లెలు సంధ్యలకు స్వల్పంగా గాయాలయ్యాయి. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

బస్సు ఢీ.. వ్యక్తికి గాయాలు



మొగుళ్లపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఇస్సిపేట గ్రామ శివారులోని వాగొడ్డుపల్లి గ్రామానికి చెందిన గండె సాయికుమార్ మొగుళ్లపల్లి నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో పరకాల నుంచి జమ్మికుంటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో సాయికుమార్ కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అంతిమయాత్రకు అరిగోస


చలివాగు దారిలో అంతిమయాత్రకు వెళ్లే ముందు చదును చేస్తున్న డోజర్(ఫైల్)


ఏలేటిరామయ్యపల్లిలో వైకుంఠధామానికి వెళ్లే దారిలో ఉన్న రాళ్లు

వైకుంఠధామాలకు సరిగా లేని రహదారులు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు


ఏలేటిరామయ్యపల్లిలో అధ్వానంగా ఉన్న వైకుంఠధామానికి వెళ్లే రోడ్డు

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించింది. కానీ అంతిమయాత్రలో భాగంగా వెళ్లడానికి దారులు సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ఓ అధికారి అతడి తండ్రి మృతి చెందగా చిట్యాల చలివాగుకు తీసుకుపోవడానికి డోజర్‌తో మట్టిని సరిచేసుకుని తీసుకెళ్లిన పరిస్థితి. అలాగే కొన్ని గ్రామాలలో అనుకూలమైన స్థలంలో వైకుంఠధామాలను ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో చిట్యాల, వెంకట్రావుపల్లి, చింతలపల్లిలో మృతదేహాలను ఆయా గ్రామాల ఊరి చివరి వైపున ఖననం చేస్తోంటారు. మండల కేంద్రానికి మూడు వైపులా వైకుంఠధామాలు నిర్మించాల్సిన ఉండగా చింతపలల్లి వైపు మాత్రమే నిర్మించారు. మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీ, చిట్యాల బీసీ కాలనీ వారు చలివాగు వద్దకు వెళ్లాలంటే దారి సక్రమంగా లేదు. అలాగే మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో వైకుంఠధామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. దారి మొత్తం గుంతలు, రాళ్లతో ఉంది. దారులు సక్రమంగా లేకపోవడంతో అధికారుల పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠధామాలకు శాశ్వత రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామ చివరన ఉన్న చలివాగు పక్కన వైకుంఠ ధామం నిర్మించారు. కాని ఇంత వరకు రోడ్డు వేయలేదు. మృతి చెందిన వారిని తీసుకపోవడానికి అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో మా ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలి.



– ఏలేటి రాఘవారెడ్డి, ఏలేటిరామయ్యపల్లి

కోటంచ ఆలయంలో కార్తీక దీపోత్సవం

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున మహిళలు, దంపతులు పాల్గొని సామూహిక దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచార్యులు, శ్రీనాథ్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.


సామూహిక దీపారాధనలో పాల్గొన్న భక్తులు

విద్యుత్ సమస్యలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఎన్పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సమస్యలపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఈఈ వెంకటేశం సబ్ ఇంజనీర్ ప్రశాంత్, లైన్‌మన్ శౌకత్‌అలీ, సిబ్బంది వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం..


మాట్లాడుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో పోలీసులు ముందుంటారని, ఎవరికైనా సమస్య వస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని గాంధీనగర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ హాజరై మాట్లాడుతూ.. ఎస్పీ డాక్టర్ శబరీశ్ ఆదేశాల మేరకు మండలంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సభలు నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు


సమావేశానికి బయల్దేరిన నాయకులు

గోవిందరావుపేట: హైదరాబాద్‌లోని ఆదిభట్లలో ఆదివారం నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ ప్రథమ వార్షికోత్సవ ప్లీనరీ సమావేశానికి జిల్లా కన్వీనర్ తరుణ్, మండల అధ్యక్షుడు అన్వేశ్ ఆధ్వర్యంలో మండల నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన తాళ్ల భిక్షపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బోనపల్లి రఘుపతిరెడ్డి ఆదివారం పరామర్శించి రూ. 26వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట పార్టీ గ్రామ అధ్యక్షుడు వైద్యుల ఆదిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎలమంచ జయపాల్‌రెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ నరేష్, నెక్ట్స్ జనరేషన్ యూత్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు అశోక్, సంజీవయ్య, కట్టయ్య, రాజయ్య, రమేశ్, పైడి, రవి, అభిలాష్, సంతోష్, రవీందర్ ఉన్నారు.

ఫౌంటెయిన్‌ను తలపిస్తున్న దేవాదుల నీరు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్‌కు వెళ్లే దేవాదుల పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీక్ అవడంతో నీరు ఎగిసిపడుతూ ఫౌంటెయిన్‌ను తలపిస్తోంది. మైలారం నుంచి సున్నపురాళ్ల గడ్డ మీదుగా పెద్ద కోడెపాకకు వెళ్లే దారిలో శనివారం రాత్రి పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీకై 100 మీటర్ల ఎత్తుతో నీరు ఎగిసి పడుతుంది. అయితే పక్కనే 220 విద్యుత్ లైన్లపై నీరు పడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లీకేజీ నీటితో చుట్టుపక్కల పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. మూడు నెలల క్రితం వరి పంట సాగు చేశామని, కోతలు కోసే తరుణంలో పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీకేజీ అవడంతో పొలాలు నీటితో నిండిపోయి హార్వెస్టర్‌తో కోతలు కోసే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


ఎగిసిపడుతున్న దేవాదుల నీరు

కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

కమలాపూర్ : ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గుడిబండ వద్ద ఆదివారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న కష్టాలకు కృంగిపోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి తమ పిల్లలను అనాథలుగా మార్చొద్దన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అపరిచితుల నుంచి వస్తున్న కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, ముఖ్యంగా తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగిపోయినందున ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లోని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం, గుట్కా, గంజాయి వంటి వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని యువకులకు సూచించారు. అలాగే నేరాల నియంత్రణ కోసం ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పోలీస్ కళాకారులు నాటికల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక



గంగారం: రాష్ట్ర స్థాయి క్రీడలకు గంగారం ఆశ్రమోన్నత విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కల్తి కాంతారావు తెలిపారు. ఇటీవల ఏటూరునాగారంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు ఐశ్వర్య, లక్ష్మీప్రియ, శ్రావణి, సుమలత, నిఖిత, సంజేశ్వరీ ప్రతిభ కనబర్చారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ సువర్ణపాక పాపారావు, పీడీ రేగు రమేష్, ఉపాధ్యాయులు యాకలక్ష్మీ, వెంకటలక్ష్మీ, రమేశ్, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన దండ్రె రమేశ్–కవితల కూతురు మహాలక్ష్మి కొన్ని రోజులుగా డికాంపెన్సెటేడ్ లివర్ డిసీజ్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాగా, శనివారం వ్యక్తిగత పనిపై అదే ఆస్పత్రికి వెళ్లిన మంత్రి కొండా సురేఖకు రమేశ్-కవిత వారి కూతురు ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి వైద్య ఖర్చుల కోసం రూ.1లక్షను అందించి పాపకు వెంటనే ఆపరేషన్ చేయాలని డాక్టర్లను ఆదేశించారు. దాంతో డాక్టర్లు ఆపరేషన్‌ను పూర్తి చేయడంతో ప్రాణాపాయం నుంచి పాప బయటపడింది. ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు ఆదివారం మాట్లాడుతూ.. పాపకు మంత్రి కొండ సురేఖ ప్రాణ భిక్ష పెట్టిందని, ఆస్పత్రిలో మంత్రి కలువకుంటే తమ పరిస్థితి మరోలా ఉండేదని అన్నారు.


పాప తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మెస్‌చార్జీల పెంపుపై హర్షం


ఎస్ఎస్ తాడ్వాయి: హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థినులు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడం హర్షించ దగిన విషయమని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల కళాశాల జగ్గన్నపేట ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు రూ.1500 ఉండగా రూ.2100 పెంచిందని అన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ప్రిన్సిపాల్ సెక్రటరీ శరత్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీడీ పోచం, ఏటీడీఓ దేశిరాంలకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచడంతో స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లక్ష్మి, విద్యార్థినులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ మోకాళ్ల లక్ష్మి మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యవసరాల ధరలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మెస్ చార్జీలు పెంచడం సంతోషదాయకరమన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమన్నారు. ఉత్తర్వులు జారీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థినులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం: మండలంలోని విలాసాగర్‌కు ఇటీవల మృతి చెందిన మహమ్మద్ నబీ, పోచిరెడ్డి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ యూత్ నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూల మాలవేసి నివాళులర్పించారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, తెప్పెల దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.


నివాళులర్పిస్తున్న శ్రీనుబాబు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో గల పద్మ హైస్కూల్‌లో 2003–2004 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. చాలాకాలం తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత పరిటాల బాలకృష్ణమూర్తి, అప్పటి ఉపాధ్యాయులు భీమ్‌రావు, పోతరాజు రాజేందర్, రవికుమార్, జమాండ్ల అశోక్, పెరుమాండ్ల కిశోర్‌కుమార్, రమేశ్, మాస్కుల రాజేంద్రప్రసాద్, ప్రసాద్, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, రాజును పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆర్గనైజర్లుగా జనగాం రంజిత్, దేవా ప్రత్యూష వ్యవహరించారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

కమలాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన గ్యారంటీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం మండల అధ్యక్షుడు మాటం సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మండలస్థాయి ఉద్యమకారుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక ధ్యేయంగా పోరాటం చేశామని గుర్తు చేశారు. కేసుల పాలై జైళ్లకు వెళ్లి కోర్టుల చుట్టూ తిరిగామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఉద్యమకారులకు అవకాశమిచ్చి గుర్తించిందని, వాటిని త్వరగా నెరవేర్చాలని అన్నారు. అదేవిధంగా ఈనెల 9న మరోసారి సమావేశమై ఉద్యమకారుల కార్యాచరణను ప్రకటిస్తామని, నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. సంపత్‌రావు, ప్రసాద్, శోభన్ బాబు, సాంబయ్య, రమేశ్, సదానందం, ఓదెలు, సారయ్య, కుమారస్వామి, రవి, రాజేందర్, శ్రీనివాస్, పోచాలు, లక్ష్మీనారాయణ, అశోక్, ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

‘అక్రమ వసూళ్లకు పాల్పడలేదు’

మల్హర్ : దళితబంధు పథకానికి సంబంధించి తాను ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడలేదని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో నిజం లేదన్నారు. 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న తన కుటుంబం ఏనాడూ అవినీతికి పాల్పడలేదన్నారు. ప్రత్యర్థులు చేసిన ఆరోపణలు నిజ నిర్ధారణ చేసుకోకుండా హెచ్చరించడం సరైంది కాదన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.